
'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

- ఎ.జయలక్ష్మిరాజు

# మరణ వాంగ్మూలం



గవర్నమెంటు హాస్పిటల్ ఆవరణంతా బాలాజీ బంధుమిత్రులతో క్రిక్కిరిసి ఉంది. బాలాజీ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు. రెండు గంటల క్రితం బాలాజీని గుర్తు తెలియని వ్యక్తులు కత్తి పోట్లతో గాయపరిచారు. చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాలాజీని బంధుమిత్రులు హాస్పిటల్లో చేర్చారు. బాలాజీ భార్య, పిల్లలు, ముసలి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, ప్రాణానికి ప్రాణమిచ్చి, ఆత్మాహుతికి కూడా సిద్ధమయే అభిమానులు హాస్పిటల్ ఆవరణంతా గుమిగూడి అతని ప్రాణాపాయం గురించి మాట్లాడుకుంటున్నారు. బాలాజీ దగ్గరికి అందర్నీ రానివ్వటంలేదు. కావలసిన వాళ్లు మాత్రం లోపల అతని బెడ్‌కు కాస్త దూరంలో ఉన్నారు. లాయర్లు పోలీసులు, బాలాజీ మరణవాంగ్మూలం కోసం మంచం చుట్టూ చేరారు. బాలాజీ వంటి నిండా బ్యాండేజీ. కళ్లు బలవంతంగా తెరుస్తున్నాడు. మూస్తున్నాడు. తనని మాట్లాడించి మరణ వాంగ్మూలం తీసుకోవాలని డాక్టర్లు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

"బాలూ! బాలూ! బాలాజీ! బాలాజీగారూ! అంటూ చెవి దగ్గర చేరి ఒక్కొక్కరు పిలుస్తున్నారు. వారి మాటలు తనకు వినిపిస్తున్నాయి. తనకు ఎంతో మాట్లాడాలనుంది, చెప్పాలనిఉంది. కానీ గొంతు పెగలటం లేదు. "ఏమిటి తడు? అటు చావడు! ఇటు మాట్లాడడు! ప్రాణాలు తోడేస్తున్నాడు. నాకవతల నా నర్సింగ్ హోంలో ఆపరేషనుంది," ఓ డాక్టరు గుస గుసగా మరో డాక్టరుతో అంటున్నాడు.

"గప్‌చిప్‌గా ఉండండి! అసలే ఈ ఫ్యాక్షనిస్టులకు, నోరూ, చెయ్యి దుబారా! అతని బంధువులెవరయినా విన్నారంటే అతనికి పట్టినగతే మనకూ పడుతుంది" కిసుక్కున నవ్వి మూతి మూసుకున్నాడు మరో డాక్టరు.

బాలాజీ భార్య సుమలత భర్త మంచం దగ్గర నిలబడి నోట్లో గుడ్డ కుక్కుకుని ఏడుస్తోంది. స్పర్శించి బాధపడటానిక్కూడా వీల్లేకుండా రక్తసిక్తమైన బ్యాండేజీ, కళ్లు మాత్రం తిప్పి భార్యవైపు చూశాడు బాలాజీ. "పరమ సాధ్వీ! పతివ్రత, మహా ఇల్లాలు. ఏ తల్లికన్న బిడ్డో, తన పాలబడి కష్టాలనుభవిస్తోంది. ఏనాడూ నోరుతెరచి తనకిది కావాలని అడగలేదు. జన్మకో శివరాత్రి అన్నట్టు ఎప్పుడైనా ఓ మూర పూలు తెచ్చిస్తే దేవేంద్రుడుతో పోరాడి పారిజాత వృక్షాన్ని తెచ్చిచ్చినంతగా పొంగిపోయే అల్పసంతోషి. ప్రియతమా! నేస్తమా! బ్రతికినన్నాళ్లూ నిన్నో పని యంత్రంగా మాత్రమే గుర్తించాను తప్ప, మనసున్న మనిషిగా, భార్యగా గుర్తించి మనసు విప్పి ఏనాడూ మాట్లాడలేదు. నాకిప్పుడు నీతో మాట్లాడాలనుంది. అబ్బా! నోటితో అరిచి బాధపడే వీలుకూడా లేకుండా తనకు నోట మాట రావటంలేదు. తనను మాట్లాడమంటున్నారు. మాట్లాడితే రాసుకోవాలని పెన్నూ పుస్తకాలు పట్టుక్కూర్చున్నారు. తన నోటినించి వచ్చే మాటల్ని దివ్య సందేశంగా రిజిస్టరు చేసుకోవాలని తహతహతో టేప్ రికార్డర్లు ఆన్ చేసుకుక్కూర్చున్నారు.

కానీ ఏం లాభం! తను మాట్లాడలేక పోతున్నాడు. ఓ ముక్కోటి దేవతలారా! నాకు మాట్లాడే శక్తినివ్వండి! నాకు బ్రతకాలనుంది. నా వయసిపుడు ముప్పయ్ అయిదు సంవత్సరాలు మాత్రమే. ఇంకా అరవై అయిదు సంవత్సరాలు బ్రతకాలి. నా భార్య అనాథ! అమాయకురాలు. నేను పోతే తనకు దిక్కెవరు? నాకిద్దరు పిల్లలున్నారు. తండ్రి లేకపోతే వారినెవరు పోషిస్తారు? యమధర్మరాజా! చిత్రగుప్తుడు తప్పుడు లెక్క చూపిస్తే నువ్వు దున్నపోతునెక్కి మీద మీదకు రావటమేనా? నాకప్పుడే చావేంటి? నాకు దీర్ఘరోగాలేవీ లేవు. తలనెప్పి కూడా ఎరగని నేను చావటమా? చంపక తప్పదా? చంపితే చంపావు. ఓ గంటాగి రావయ్యా బాబూ! నేను మాట్లాడాలి. హే భగవాన్! నాకు మాట్లాడే శక్తినివ్వు! నా మాటలు వినేదాకా వీళ్లు నన్ను చావనివ్వరు. ఒకప్పుడు ఎంతోమంది మాట్లాడుతున్నా నా చెవికెక్కలేదు. కానీ ఈరోజు నా చివరి మాటకోసం తహతహ లాడుతూ ఇంతమంది... కళ్లు మూసుకున్నాడు బాలాజీ! గత కాలపు అనుభవాల తాలూకు కన్నీళ్లుగా మారి దిండు మీదికి చేరుతున్నాయి.

* * *

పోతయ్య, నారయ్య ఆ పల్లెటూరినేలే కామందులు. రచ్చబండ మీద కూర్చుని ఊళ్లోవాళ్లకు పంచాయితీలు చేసి తీర్పునిచ్చేవారు. ఇద్దరూ మంచి స్నేహితులు. చెరో నలుగురు పిల్లలున్నారు. పోతయ్య కొడుకు బాలాజీ! నారయ్య కొడుకు సూరిబాబు! చిన్నప్పుడంతా కలిసి మెలిసి స్కూలుకు వెళ్లి స్కూలు చదువు ముగించారు. ఇద్దరూ దగ్గర్లో ఉన్న టౌనులో కాలేజీలో చేరారు. హాస్టల్లో చేరారు. కాలేజీ ఎలక్షన్లలో ఇద్దరూ పోటీచేశారు. నోరు దుబారాతో తిట్టిపోసుకున్నారు. దాంతో కక్షలు పెరిగాయి. అదేదో మంత్రి పదవి అయినట్టు, చెరో లక్ష ఖర్చుపెట్టారు. రెండు ఓట్ల తేడాతో బాలాజీ ఓడిపోయాడు. అంతే! రాజ్యాన్ని కోల్పోయినట్టు ఫీలయిపోయి, అదేదో పెద్ద అవమానభారమై, తెగ ఫీలయిపోయాడు బాలాజీ! సూరిబాబును బూతులు తిట్టాడు బాలాజీ. స్నేహితుల చెప్పుడు మాటలు విని ఇద్దరూ బద్ధశత్రువులైపోయి ఒకరికొకరు కుమ్ముకోవటం, బూతులు మాట్లాడుకోవటం, చెరో వంద మందిని ముఠాలేర్పరచుకోవటం, వారిని మేపటం, ... ... రాజకీయం రాజ్యమేలింది. చదువు అటకెక్కింది. అక్కడ ఆ పల్లెటూరికి ఈ విషయం ప్రాకి పెద్దవాళ్లు శత్రువులయిపోయి పోట్లాట పెరిగింది. బాలాజీ తండ్రి పోతయ్య సూరిబాబుకు సంబంధించిన చీనీ తోటలు నరికించాడు. సూరిబాబు తండ్రి నారయ్య పోతయ్య కూతురి భర్తను చంపి విధవను చేశాడు. నారయ్య పోతయ్య బావమరిదిని చంపించాడు. అయిదు సంవత్సరాల

కాలంలో అటు ఓ అయిదు, ఇటు ఓ అయిదు మంది చంపబడ్డారు. రావణకాష్టంలా రగులుకుంటూనే ఉంది. చనిపోయిన వారందరూ తమ మరణవాఙ్మూలంలో ఇవతలివారే తమ చావుకు కారణమని చెప్పటం... ఫలితంగా పోలీసులు, కేసులు, కోర్టులూ... లాయర్లు... ఆస్తులు హరించుకుపోతున్నా ఎవ్వరికీ నోరు దుబారా తగ్గలేదు. పోట్లాటలు ఆగలేదు. కత్తులు నూరుతూ, బాంబులు తయారుచేస్తూ... వారి ప్రపంచమే మారిపోయింది.

బాలాజీకి పెళ్లి అతికష్టంమీద అయింది. "ఎప్పుడు ఎవడో ఎప్పుడు చస్తాడో తెలియని వానికి మేం పిల్లనివ్వం!"అని స్పష్టంగా చెప్పకపోయినా, ఏదో కారణంతో అమ్మాయిల తల్లిదండ్రులు తప్పించుకున్నారు. అనాధాశ్రమం వెళ్లి తనకు సరిపోయే అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు. సూరిబాబు పరిస్థితీ అంతే! పెళ్లిళ్లు అయినప్పటినించి నోరు దుబారా పెరిగింది. సూరిబాబుగాడు బ్రోతల్ హౌస్ నించి వచ్చిన పిల్లను చేసుకున్నాడని ప్రచారం చేశాడు బాలాజీ. దాని ఫలితంగా సూరిబాబు బాలాజీనే లేపెయ్యాలని ప్లాను చేశాడు. దాదాపు నాలుగు సంవత్సరాల నించి కాపుకాస్తున్నాడు. ఆ సంగతి బాలాజీకి తెలిసి ఇతనూ అదే ప్లాను వేశాడు సూరిబాబును లేపెయ్యాలని. బయటికెళితే బాడీగార్డు. దేనికీ స్వేచ్ఛలేదు. అయినా ఎంతో హ్యాపీగా జీవిస్తున్నట్లు ఆత్మవంచన. బాలాజీ భార్య, సుమలత ఇవన్నీ చూసి ఒకేఒక్కసారి నోరు విప్పింది.

"మీకీ జీవితం ఆనందాన్నిస్తోందా?"

"అంటే?" భృకుటి ముడిచి అడిగాడు బాలాజీ.

"ఇంతమంది జనంలో ఉన్నా, ఒంటరిగా ఫీలవుతూ, దేనిమీదా ధ్యాస ఉండక, ధ్యానం కుదరక, మీరెవర్ని నమ్మక మిమ్మల్నెవరూ నమ్మక, ఓ పెద్ద కన్‌ఫ్యూజన్ అనుక్షణం మెదడును తొలుస్తూ, భద్రతకోసం గుంపు నేర్పరచుకుంటూ, మళ్లీ అదెంతవరకు భద్రంగా ఉంటుందో, ఉండదోనన్న భయం తొలుస్తుంటే... మీకీ జీవితం ఆనందాన్నిస్తోందా?" హేళన ధ్వనిస్తూ అడిగింది.

"చూడూ! నీతులు వల్లించకు! నేను పుట్టకముందే ఫ్యాక్షనిజం అనే వ్యవస్థ పుట్టింది, నాలాంటివారు దాన్ని పెంచి పోషించాలే తప్ప త్రుంచకూడదు. నా ధ్యేయం కక్షసాధింపు. అనుభూతులు, మానవత్వం, గుడ్డూ, కూసూ అంటూ బ్రతకటం నాకు చేతకాదు!"

"రేపు మీకేదైనా జరిగితే..."?

"ఏమీ జరగదు. నీ లైఫ్‌కే ఢోకా ఉండదు. శత్రుశేషం లేకుండా చేసుకుని హ్యాపీగా బ్రతికేస్తాను."

"ఎన్నేళ్లకు"?

"సంవత్సరం కావచ్చు. పదేళ్లు... ఇరవై... ముప్పయ్... ఏళ్లు గడవచ్చు... కానీ కక్ష సాధింపు మాత్రం మానేది లేదు."

దేవుడు మనిషికి ఇచ్చి జంతువులకివ్వని ఒకేఒక్క వరం హృదయం! అనుభూతులు, సుఖం, దుఃఖం, భావుకత్వం ప్రేమ ఆప్యాయత ఇవన్నీ మనిషి సొంత అనుభూతులు. జంతువుల్లా మనిషి ప్రేమ తాత్కాలికం కాదు. ఊపిరి ఆగిపోయే వరకు సంతానం పట్ల, తనవారి పట్ల ప్రేమ ఆప్యాయతలు చంపుకోలేడు. కానీ ఈ వ్యవస్థలో ఈ బాంబుల సంస్కృతిలో మనిషి జంతువులా మారిపోతున్నాడు. పద్ధతి తప్పి బ్రతికే ఇలాంటివాళ్లు మారాలంటే ఏ అద్భుత శక్తో పరకాయ ప్రవేశంచేస్తే తప్ప మారరు.



"చూడూ! నీతులు వల్లించకు! నేను పుట్టకముందే ఫ్యాక్షనిజం అనే వ్యవస్థ పుట్టింది, నాలాంటివారు దాన్ని పెంచి పోషించాలే తప్ప త్రుంచకూడదు. నా ధ్యేయం కక్షసాధింపు. అనుభూతులు, మానవత్వం, గుడ్డూ, కూసూ అంటూ బ్రతకటం నాకు చేతకాదు!"

నవ్వుకుంది లత.

"ఏమిటి నవ్వుతున్నావు? నిన్ను కూడా నమ్మటానికి వీల్లేదు. నన్ను చంపటానికెవరితోనైనా చేరి గూడుపుఠాణీ జరిపిస్తున్నావా?" అన్నాడు అనుమానంగా బాలాజీ!

దుర్భరమైన అతని మానసిక స్థితిని చూసి నిట్టూరుస్తూ అక్కడినించి తప్పుకుంది సుమలత.

* * *

సూరిబాబు ప్లాను ఫలించింది. కాపుకాసి బాలాజీని నరికాడు. "ఏరా? నా పెళ్లాం బ్రోతల్ హౌసునించి వచ్చిందంటావా? మా అమ్మను బూతులు తిడతావా? మా అక్కలకు రంకులుగడతావా? పగ ఉంటే నువ్వు మగాడివైతే నీ ప్రతాపం నామీద చూపించాలి గానీ, ఇంట్లో ఆడోళ్లమీద ప్రచారాలు చేసి నవ్వుతావా?" అంటూ వేటకొడవళ్లతో స్వయంగా దాడి చేశాడు. ఫలితంగా బాలాజీ చావుబ్రతుకుల్లో హాస్పిటల్ పాలు...

"బాలాజీ నీమీద దాడిచేసిన వారి గురించి చెప్పు! వారికి బలమైన శిక్ష పడుతుంది. మన పగ చల్లారుతుంది!" స్నేహితులు, శ్రేయోభిలాషులు చెవి దగ్గర రొద పెడుతున్నారు.

"ఉదయం నించి కాచుక్కూర్చున్నా మిడి గుడ్లేసుకుని చూస్తాడే తప్ప నోరు తెరవడు! నాకవతల మీటింగుంది!" ఓ డాక్టరంటున్నాడు.

"ఏ మీటింగు?"

"ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. నోటి వ్యాధుల గురించి ఉపన్యాసమివ్వాలి"!

కళ్లు తిప్పి చూశాడు బాలాజీ ఆ డాక్టరు వైపు.

"సార్! అయ్యా! బాబూ! నేను మాట్లాడుతున్నాను. వినండి! నా మాటలని కొట్టిపారేయకండి! అందరూ వినండి! నా ఈ మరణానికి కారకులెవరో చెబుతాను. ముందుగా నాదో మనవి. ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నారు కదూ! నోటి వ్యాధుల గురించి మాత్రమే 'స్పీచ్'లివ్వబోతున్నారా? నోట్లో ఉన్న ఈ నాలుకను మరిచారా? అతి ముఖ్యమైన, అతి ప్రమాదకరమైన, ప్రపంచంలో హింస పెరగటానికి కారణమైన ఈ నాలుకను అదుపులో ఉంచుకోమని చెప్పరెందుకు? నాలుకను ఆరోగ్యకరమైన మాటలకు మాత్రమే పరిమితం చెయ్యమని నాలాంటి నీచులకు చెప్పండి! ఈ వ్యవస్థని రూపుమాపండి! ఆరోగ్యకరమైన మాటలు, శుభ్రమైన మాటలు మాత్రమే నాలుక ఉచ్చరిస్తే ఇల్లు, సంఘం, దేశం, ప్రపంచం ఆరోగ్యంగా ఉంటుంది. అప్పుడు ఆరోగ్య దినోత్సవాలు జరపండి!"... బాలాజీ మనసులోంచి పొంగిన భావాలు పెదవుల మీదికి రాలేకపోతున్నాయి.

"చెప్పు! బాలాజీ! నీ చావుకు కారకులెవరు?"

"నా... చా...వు...కు కారణం... నే... నే..."

"ఏమిటీ?" అందరి గొంతుల్లో ఆశ్చర్యం!

నేనే! నే... నే... నే... నే... నోరు విప్పి చెప్పి శాశ్వతంగా కళ్లు మూసుకున్నాడు బాలాజీ!

★

# పులుల దేవాలయం!



**బ్యాంకాక్**‌కు 322 కిలోమీటర్ల దూరంలోని కారడవిలో ఓ బౌద్ధారామం ఉంది. సువిశాలమైన ప్రదేశంలో అద్భుతమైన శిల్పాలతో, రమణీయ బుద్ధ విగ్రహాలు రూపుదాల్చిన దేవాలయమది. థాయ్‌లాండ్ అడవులకే వన్నెతెచ్చే బౌద్ధారామం అది. ఈ ఆరామం విశిష్టత ఏమంటే, ఇక్కడ పెద్దపులులు, పులిపిల్లలు స్వేచ్ఛగా సంచరిస్తూ వుంటాయి. పెంపుడు జంతువుల మాదిరి కలిసిమెలిసి తిరుగుతుంటాయి. '95లో ఆయల నిర్వాహకుడు అచన్ బుసిత్ ఛాన్ -కౌంతీ హారోక్‌కు రెండు చిన్నారి పులిపిల్లలు లభించాయి. వేటగాళ్లు ఆ పిల్లల తల్లిని చంపడం వల్ల అవి అనాథలయ్యాయి. దయార్ద్ర హృదయంతో అచన్ వాటిని తమ ఆరామానికి తీసుకెళ్లి పెంచాడు. అనంతరం తల్లిని పోగొట్టుకున్న, గ్రామస్తులు పెంచలేక ఇచ్చేసినవి, వేటగాళ్ల విషప్రయోగానికి గురై మరణావస్థలో దొరికినవి -ఇలా అనేక పులిపిల్లలకు ఆ ఆరామం ఆశ్రయమైంది. కాలక్రమేణా అవి పెరిగి పెద్దవయ్యాయి. బాల్యంనుంచీ ఆరామంలోనే తిరిగిన పులిపిల్లలతో అక్కడివాళ్లకు మచ్చిక ఏర్పడింది. పులిని చూసి పారిపోయే మనలాంటి వాళ్లకు ఇది దిగ్భ్రమ కలిగించే అంశమే. 'పులుల దేవాలయం'గా పేరొందిన ఆ ఆరామాన్ని చూడ్డానికి నిత్యం అనేక దేశాలనుంచి ఎందరో వస్తూంటారు. ప్రస్తుతం ఇపుడక్కడ పది పులులు, 9పులిపిల్లలు జీవిస్తున్నాయి. థాయ్ అడవులు క్రమేపీ క్షీణించి, వ్యవసాయ క్షేత్రాలుగా మారుతుండటంతో అడవుల్లో సంచరించే కొన్ని పులులు చెల్లాచెదురైపోయాయి.

దీంతో అచన్, డాక్టర్ సోమ్‌సక్‌తో కలసి పులుల సంరక్షణకు భారీ పథకాన్ని రూపొందించాడు. కోట్ల రూపాయలు అవసరమయ్యే ఈ పథకం పనులు అప్పుడే ప్రారంభమయ్యాయి. కారడవిలో డైనమేట్లతో కొండలను పిండిచేసి, సువిశాల భవనాలు నిర్మించబోతున్నారు. క్షీణదశకు చేరుకున్న పులుల సంఖ్యను మళ్లీ విస్తరించాలన్న ధ్యేయంతో అచన్ కన్పిస్తున్నాడు. ఆయన ఆశయం నెరవేరాలని అందరూ ఆశిద్దాం.

-కొడిమెల